క్లుప్తంగా

డ్రెయినేజీ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని 22వ వార్డు ఆదిత్య ఎంక్లేవ్ కాలనీలో మంగళవారం మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు రూ.6లక్షలతో డ్రెయినేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, నాయకులు మెరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటి పన్ను బకాయిలు చెల్లించండి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి యజమానులు వెంటనే ఇంటి పన్నును చెల్లించి, మున్సిపాలిటీకి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100శాతం ఇంటి పన్నును మార్చి 31వ తేదీ లోగా నేరుగా మున్సిపల్ కార్యాలయంలోని కౌంటర్‌లో గాని, బిల్‌కలెక్టర్లకు గాని, ఆన్‌లైన్ https://cdma.cgg.gov.in/cdma.arbs/CDMA_PG/PTMenu ద్వారా బకాయిలను చెల్లించి సహకరించాలని తెలిపారు. పన్ను చెల్లించని వారి నీటి కుళాయిని తొలగించి, ఇంటి ఆస్తిని చట్టప్రకారం జప్తు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ పోటీలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాలలో బొలిశెట్టి హనుమంతు పటేల్ స్మారక జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పాతమంచిర్యాల క్రికెట్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బొలిశెట్టి కిషన్, ఎర్రం ప్రభాకర్, ఆంబ్రోస్, రమేశ్ యాదవ్, పానుగంటి చందు, బొలిశెట్టి ప్రశాంత్, తూముల ప్రభాకర్, బొలిశెట్టి వెంకటేశ్, రాజన్న పాల్గొన్నారు.

పీఏసీఎస్ అవిశ్వాసంపై చర్చ!

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లపై, సంఘంలోని ఎనిమిది సభ్యులు అవిశ్వాసానికి తెరలేపిన విషయం తెలిసిందే. ఎనిమిది మంది సభ్యులు రహస్య శిబిరానికి కూడా తరలివెళ్లారు. అయితే శిబిరంలో ఉన్న ఎనిమిది మందిలో మంగళవారం ఒకరు బయటకు వచ్చినట్లు సమాచారం. దీంతో అవిశ్వాస ప్రయత్నాలు, చేజారుతాయా? లేక నెగ్గుతాయో.? ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఎందుకంటే రహస్య శిబిరానికి ఎనిమిది మంది వెళ్లగా, రెండో రోజుకే ఒకరు శిబిరం నుంచి బయటకు రావడంతో అవిశ్వాస ప్రయత్నాలు, చివరకు ఎటు మలుపు తిరుగుతుందో అని మండల నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం శిబిరంలో ఉన్న ఏడుగురు సభ్యులకు ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత మద్దతుగా నిలిచినట్లు సమాచారం.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

మందమర్రిరూరల్: పట్టణంలోని మొదటి జోన్‌కు చెందిన ఎండీ రియాజ్(28) మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహాత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. రియాజ్ ఫ్లిప్‌కార్ట్‌లో కొరియర్ బాయ్‌గా పనిచేస్తున్నట్లు, ఈ మధ్య ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయని, అసహనానికి గురైన ఆయన ఆత్మహత్య పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడికి గతేడాది జనవరిలో సీసీసీకి చెందిన సల్మాతో వివాహం కాగా ఇరవై రోజుల క్రితం కూతురు పుట్టింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు.



వృథాగా మిషన్ భగీరథ నీరు

జిల్లా కేంద్రంలోని తోళ్లవాగు దగ్గర, గుడిపేట గుట్టపై మంగళవారం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై నీరంతా వృథా అయింది. కాగా ఆ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల





డబుల్ రిపేర్ భారం ఎవరి పైనో?

- విరిగిన తలుపులు, పగిలిన కిటికీల అద్దాలు
- మందుబాబులు, పశువులకు నిలయంగా ఇళ్లు
- కాంట్రాక్టర్ చేసిస్తాడా.. లబ్ధిదారులే చేసుకోవాలా?



పగిలిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కిటికీ అద్దాలు

మంచిర్యాలటౌన్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినా ఇళ్ల పంపిణీ ఆలస్యం కావడంతో ఆ ఇళ్లు నివాసం ఉండేందుకు పనికిరాకుండా మారాయి. కిటికీల అద్దాలు పూర్తిగా పగిలిపోగా, తలుపులు విరగ్గొట్టి, బెడాలు ఎత్తుకెళ్లారు. జిల్లా కేంద్రంలో మొత్తం 650ఇళ్లు నిర్మించగా, అందులో 30ఇళ్లను గతంలోనే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 620ఇళ్లల్లో 330ఇళ్ల పంపిణీ కోసం ఇదివరకే మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో అర్హులను గుర్తించారు. 2,958దరఖాస్తులను పరిశీలించి, 1,621మందితో కూడిన తుది జాబితాను ఇటీవలనే ప్రకటించి, వారికి టోకెన్లు సైతం తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. ప్రస్తుతం 330ఇళ్లను డ్రా పద్ధతిలో కేటాయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. ఇళ్లను కట్టి, వాటికి రక్షణ ఏర్పాటు చేయకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారడంతో తలుపులను విరగ్గొట్టారు. తలుపులు లేకపోవడంతో పశువులు ఇళ్లల్లోకి వచ్చి చేరాయి. దీంతో పశువుల కొట్టంలా ఇళ్లు మారిపోయి, నివాసం ఉండేందుకు వీలు లేకుండా మారాయి. విద్యుత్ కనెక్షన్ ఇవ్వక పోవడం, బాత్రూంలోని కుండీలను పగులగొట్టడం, ఫ్లోరింగ్ పాడు కావడంతో, లబ్ధిదారులు వాటికి మరమ్మతులు చేసుకోవాలంటే వేలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది.

మరమ్మతు చేసిస్తే..

జిల్లా కేంద్రంలోని 330ఇళ్లకు తలుపులు, కిటికీలు పూర్తిగా పాడయ్యాయి. ఫ్లోరింగ్ చెడిపోవడంతో పాటు, కిటికీల ఊచలను ఎత్తుకెళ్లారు. రెండేళ్లుగా ఇళ్లను పట్టించుకోకపోవడంతో ఆ ప్రాంతం అంతా పిచ్చి మొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. ఇళ్ల పంపిణీ ఆలస్యంతో గతేడాది జూన్ నెలలో కొందరు డబుల్ ఇళ్ల తాళాలను పగులగొట్టి అందులో కొద్ది రోజులు ఉండడం, వారిని అధికారులు నచ్చజెప్పి పంపించి వేయడంతో, పగులగొట్టిన తాళాలు, విరిగిన తలుపులను అలాగే వదిలేయడంతో మందుబాబులు వాటిని అడ్డాలుగా మార్చుకున్నారు. లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్లను పంపిణీ చేయనున్న నేపథ్యంలో అస్తవ్యస్తంగా ఉన్న ఇళ్లకు మరమ్మతు చేసి ఇస్తారో లేదో తెలియని పరిస్థితి. ప్రస్తుతం ఆ ఇళ్ల వద్ద అంతర్గత డ్రెయినేజీ, తాగునీటి పైపులైను, విద్యుత్ సరఫరా చేయాల్సిన పనులు ఉన్నాయి. ఇళ్ల మరమ్మతు, ఇతరత్ర పనులు చేసేందుకు ఇళ్లను నిర్మించిన కాంట్రాక్టర్‌కే పనులను అప్పగించనున్నట్లు తెలిసింది. ఈ పనులన్నింటినీ ఎన్ని రోజుల్లో పూర్తి చేసి, లబ్ధిదారులు నివాసం ఉండేలా సిద్ధం చేసి ఇస్తారో తెలియని పరిస్థితి. లబ్ధిదారులకు డ్రా పద్ధతిలో ఇళ్లను కేటాయించేలోపు మరమ్మతు పనులను చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



విరగ్గొటిన తలుపు, తొలగించిన బెడం

ఇళ్ల కేటాయింపునకు ఏర్పాట్లు పూర్తి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. లబ్ధిదారుల ఎంపిక కోసం టోకెన్లు ఇచ్చాం. ఆ టోకెన్ల ప్రకారం డ్రా పద్ధతిలో పంపిణీ చేస్తాం. మరమ్మతు చేయాల్సిన ఇళ్లకు సంబంధించిన పనులను కాంట్రాక్టర్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. లబ్ధిదారులకు కల్పించాల్సిన సౌకర్యాలతోనే ఇళ్లను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

– రాజేశ్వర్, మంచిర్యాల తహసీల్దార్

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నెన్నెల: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని పెర్కపల్లి, బట్వాన్‌పల్లి, గురిజాల, మాలగురిజాల, దుగినేపల్లి గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం పెర్కపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని వివరించారు. ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీలు సుభాష్‌రావు, శకుంతల, కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, సర్పంచ్‌లు పద్మావతి, రంజిత, అశోక్, సురేష్, ఎంపీడీవో రాజేందర్, పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, ఏఈ పరంజ్యోతి, పలు శాఖల అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నెన్నెల నా కన్నతల్లి'

నెన్నెల: మండలంలోని గుండ్లసోమారం, నార్వాయిపేట, మెట్‌పల్లి గ్రామాల్లో మంగళవారం రూ.40లక్షల సీసీ రోడ్ల పనులకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నెన్నెల మండలం నా కన్నతల్లిలాంటిదని పుట్టింది, పెరిగింది, చదివింది, రాజకీయ రంగప్రవేశం చేసింది నెన్నెలలోనేనని అందుకే నెన్నెల మండలమంటే నాకు ప్రేమ ఎక్కువన్నారు. గుండ్లసోమారంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించి వంద శాతం కంటి పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. నెన్నెల మండలాన్ని విడతల వారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రగతి పథంలో నడిపిస్తానన్నారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలు గుర్తించి ఆదరించాలని కోరారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, సహకార సంఘం చైర్మన్ మల్లేష్, మండల రైతు సమితి అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సాగర్‌గౌడ్, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, సర్పంచ్‌లు నీలమ్మ, శివ, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాంచందర్, కామెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



నియామకపత్రాలు పొందిన అభ్యర్థులతో అధికారులు

శ్రీరాంపూర్: కొత్తగా ఉద్యోగంలో చేరిన వారు గనిలో అధికారులు ఏ పని అప్పగించినా చేయాలని, కేవలం లైట్ జాబ్ కావాలంటూ రికమెండేషన్లు చేయించవద్దని, అదే ప్రధానం కాదని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం త్యాగరాజు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో నూతనంగా 32మందికి కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలను అందించారు. జీఎం కార్యాలయం వద్ద మంగళవారం నియామకపత్రాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పని చేయాలని, ప్రతి డిజిగ్నేషన్ కూడా కంపనీలో ఉత్తమమైనదే అన్నారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటి వరకు 3136మందికి, కంపెనీ వ్యాప్తంగా 10692మందికి కారుణ్య ఉద్యోగాలు అందించామన్నారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదీర్, డీజీఎంలు గోవిందరాజులు, అరవింద రావు, చిరంజీవులు, పీఎం రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, డెప్యూటీ సూపరింటెండెంట్ వెంకటరాజయ్య పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం కార్యాలయ ఆవరణలో మంగళవారం 13మందికి ఏరియా జీఎం చింతల శ్రీనివాస్ కారుణ్య నియామక పత్రాలు అందజేశారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న రఘునాథ్

వేమనపల్లి/కాసిపేట/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీజేపీ అభ్యర్థిని గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేశ్ అన్నారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి, జిల్లెడ, నాగారాం, జాజులపేట గ్రామాల్లో 'ప్రజాగోస- బీజేపీభరోసా' కార్నర్ మీటింగ్‌లు నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాసిపేట, భీమిని మండలంలోని చిన్నగుడిపేటలో బీజేపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ హాజరై కార్యకర్తలకు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అవినీతి, నిరంకుశ పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్య రక్షణకు ప్రజలు సిద్ధం కావాలని కోరారు. హాజీపూర్‌లో శక్తి కేంద్రం వారీగా కార్నర్ సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి హాజరై ప్రసంగించారు. ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ విశేష కృషి చేస్తూ బీజేపీపై ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలని వివరించారు. కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

దండేపల్లి: హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆరోపించారు. 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించి మాట్లాడారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

కాసిపేట: భూపాలపల్లిలో డిస్మిస్ చేసిన 47మంది కార్మికులను సింగరేణి యాజమాన్యం వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. కాసిపేట గనిపై గేట్‌మీటింగ్ నిర్వహించడంతో పాటు కాసిపేట–2 గని మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



దండేపల్లి: లేఖ రచనలో పాల్గొన్న విద్యార్థులు

దండేపల్లి: మాతృభాషా దినోత్సవం సందర్భంగా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ కాంప్లెక్స్ పరిధిలోని 13పాఠశాలల విద్యార్థులకు మంగళవారం లేఖరచన పోటీలు నిర్వహించారు. 'అమ్మకో లేఖ' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్తమ లేఖలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం గాయత్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుద్దాల గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు.

గ్రామాల్లో అడిషనల్ కలెక్టర్ పర్యటన



రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్

కాసిపేట/భీమిని: కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామపంచాయతీలో, కాసిపేట మండలంలోని కోమటిచేను గ్రామపంచాయతీని మంగళవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్ ఆకస్మికంగా పర్యటించారు. గ్రామపంచాయతీల్లోని రికార్డులను తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రికార్డులు సక్రమంగా మెయింటెన్ చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, నర్సరీల నిర్వహణ, పల్లెప్రకృతివనాల్లో మొక్కలను సంరక్షించే చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో రాధాకిషన్, ఎంపీవో సతీష్, ఏపీవో శ్రీనివాస్, భీమిని పంచాయతీ కార్యదర్శి శ్వేత, కాసిపేట తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీడీవో ఎం.ఏ.ఆలీం, ఎంపీవో నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లు ఉన్నారు.

వెదజల్లే పద్ధతి వరిసాగు పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏడీఏ బాపు

భీమారం: మండలంలోని ఆరెపల్లిలో వెదజల్లే పద్ధతి ద్వారా సాగు చేస్తున్న వరి పంట పొలాలను మంగళవారం చెన్నూరు ఏడీఏ జాడి బాపు పరిశీలించారు. ఈ మేరకు గ్రామంలో సాగు చేస్తున్న సాగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వెదజల్లే పద్ధతి ద్వారా రైతులు ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలిపారు. ముఖ్యంగా కూలీల కొరతను అధిగమించేందుకు సాగు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఏఈవో అరుణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

కోటపల్లి: మండలంలోని శంకరాపూర్, శెట్‌పల్లి గ్రామాల్లోని పంటలను ఏవో మహేందర్ పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో ఎన్‌పికెలు 48:24:16 సిఫారసు చేసిన మోతాదులో యురియా, పొటాష్, ఫాస్పరస్ వాడే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం వరిలో సల్ఫైడ్ లోపం, పీక పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొండక్క, రాంరెడ్డి, కో ఆర్డినేటర్ రాజం, సంపత్, ఏఈవో రాజుకుమార్ పాల్గొన్నారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ధృవీకరణ పత్రం అందుకుంటున్న ఆద్విఖ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ఏడు సంవత్సరాల నామని వెంకట ఆద్విఖ కేవలం 4నిమిషాల వ్యవధిలో 189దేశాల పేర్లను, వాటి కరెన్సీలను గుర్తించి, పఠించడం ద్వారా అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకెక్కి ఘనత సాధించింది. జిల్లా కేంద్రానికి చెందిన నామని మౌనిక రమేశ్ కుమార్ దంపతుల కుమార్తె ఆద్విఖ వేదాలు, శ్లోకాలు చెప్పడంతో పాటు భగవద్గీతలోని శ్లోకాలు, వాటి అర్థాలు చెప్తోంది. ప్రపంచంలోని దేశాలకు సంబంధించిన రాజధానుల పేర్లను చెప్తూ, క్విజ్ పరంగా కూడా ప్రతిభను చాటుతూనే, యోగాసనాలను సాధన చేస్తూ, వాటిని ప్రదర్శించి అబ్బుర పరుస్తోంది.

తహసీల్దార్, సీఐలకు సన్మానం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కత్తెరసాలలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, చెన్నూర్ పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మహేందర్, పోలీస్ సిబ్బందిని మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. జాతరను విజయవంతం చేసినందుకు సన్మానించినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

జన్నారం: ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లి అనారోగ్యంతో మృతి చెందిన ఎల్కపల్లి సాయిలు కుటుంబానికి మంగళవారం గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి కిష్టాపూర్ ఆధ్వర్యంలో పోగు చేసిన రూ.16500 సాయిలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

న్యూఢిల్లీ వెళ్లిన ఐఎన్‌టీయూసీ శ్రేణులు

మందమర్రిరూరల్/తాండూర్: న్యూఢిల్లీలో ఈ నెల 22, 23వ తేదీల్లో జరిగే ఐఎన్‌టీయూసీ ప్లీనరీ సమావేశాలకు తాండూర్, మందమర్రి మండలాల నుంచి మంగళవారం ఆ సంఘం ప్రతినిధులు బయలుదేరి వెళ్లారు.

'పోస్టాఫీస్‌లలో కొత్తఖాతాల మేళా'

పాతమంచిర్యాల: పోస్టల్ శాఖలో ఈ నెల 20 నుంచి 24వరకు కొత్తఖాతాల మేళా నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తఖాతా తీసుకోవాలనుకునేవారు పోస్టాఫీస్‌లో, ఆన్‌లైన్‌లో ఖాతాలు తీసుకోవచ్చని సూచించారు. వివరాలకు దగ్గరలోని పోస్టాఫీస్‌లో సంప్రదించాలన్నారు.

సహకార సంఘం కమిటీ ఎన్నిక

సంక్షిప్త వార్తలు

రామకృష్ణాపూర్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం బొక్కలగుట్ట గ్రామ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కందుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చీకటి కుమార్, కార్యదర్శిగా గుర్రం రాజమొగిలి, కోశాధికారిగా బుట్టి శంకర్, డైరెక్టర్లుగా ఉమేష్, మహేందర్, శ్రీనివాస్, మల్లేష్, శ్రీకాంత్‌ను ఎన్నుకున్నారు.

నాణ్యమైన పనిముట్లు అందించాలి

మందమర్రిరూరల్: ఏరియాలో ఉద్యోగులకు యాజమాన్యం నాణ్యమైన పనిముట్లు అందించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని, నాణ్యమైన పనిముట్లు అందించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ యాజమాన్యాన్ని డిమాండ్‌చేశారు. ఏరియాలోని కేకే 5గనిపై మంగళవారం కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

నర్సరీ సందర్శన

చెన్నూర్‌రూరల్: హరితహారంలో భాగంగా మండలంలోని సంకారం గ్రామంలో పెంచుతున్న నర్సరీని మంగళవారం ఎంపీడీవో టి.శ్రీనివాస్ పరిశీలించారు. మొక్కలకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నీటిని పోయాలని సూచించారు. వేసవిలో మొక్కలు ఎండి పోకుండా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, సర్పంచ్ చెడంక పున్నం, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

పాల ఉత్పత్తిపై అవగాహన

లక్సెట్టిపేట: రాబోవు వేసవి కాలంలో పాల ఉత్పత్తి పెంచడంపై రైతులు, పాలమిత్రులు అవగాహన కలిగి ఉండాలని నిజామాబాద్ విజయ డెయిరీ మేనేజర్ రమేష్ అన్నారు. మండల కేంద్రంలోని విజయడెయిరీలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల ఉత్పత్తిని పెంచేందుకు డెయిరీ ద్వారా అందించే మిశ్రమాలను పశువులకు అందించాలని సూచించారు.

బురుదగూడెంవాసుల నిరసన

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని జాతీయ రహదారిపై బురుదగూడెం వద్ద ఫ్లైఓవర్ నిర్మిస్తే రోడ్డు దాటాలన్నా, శ్మశాన వాటికకు వెళ్లాలన్న బురుదగూడెం వాసులు ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆరోపించారు. వెసులుబాటు కల్పించాలని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు.

శ్రీమద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో శ్రీ మద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా శృంగేరి శారదపీఠ ఆస్థాన పౌరాణికులు ప్రవచననిధి పౌరాణిక ప్రవర డా.బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి, పులి సీతారాం శర్మ మంగళవారం హాజరయ్యారు.

బ్లడ్‌బ్యాంక్‌కు చైర్స్ అందజేత

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంకుకు రక్తదానం చేసేందుకు గాను రూ.2లక్షల విలువ గల మూడు బ్లడ్ డొనేషన్ చైర్‌లను మంగళవారం సభ్యులు ప్రారంభించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, విర్చో బయోటిక్ కంపెనీ ప్లాస్మా డివిజన్ హెడ్ బాలకృష్ణా రెడ్డిని కోరగా మూడు చైర్‌లను అందించినట్లు తెలిపారు.

'పంటలు ఎండుతున్నా పట్టించుకోరా'



రాజేందర్‌ను నిలదీస్తున్న జెడ్పీటీసీ

లక్సెట్టిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అన్నం మంగ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పంట సాగుకు నీరందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, పంటలు ఎండిపోతున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోరా అని జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య ఇరిగేషన్ జేఈ రాజేందర్‌పై మండిపడ్డారు. జేఈ మాట్లాడుతూ మరమ్మతులు జరుపుతున్నారని త్వరలోనే పంపిణీ చేస్తామని తెలిపారు. వెంకట్రావుపేట పీహెచ్‌సీలో గర్భిణులకు సౌకర్యాలు కల్పించాలని ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్య సిబ్బందిని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడని డ్రెస్సులు పంపిణీ చేశారని, కొందరికి పొట్టిగా, మరికొందరికి పొడవుగా ఉన్నాయని, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల వద్ద అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని ఎంఈవో రవీందర్‌ను కోరారు. కొన్ని రేషన్ దుకాణాల్లో బియ్యానికి బదులు డబ్బులిస్తున్నారని, బియ్యం ఎటు వెళ్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశానికి ప్రజాప్రతినిదులు, అధికారులు సకాలంలో హాజరుకాకపోవడంతో సమావేశం ఆలస్యంగా జరిగింది. తొమ్మిది మంది ఎంపీటీసీలకు ముగ్గురు, పద్దెనిమిది మంది సర్పంచ్‌లకు నలుగురు మాత్రమే హాజరయ్యారు.